క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వంగర: మండల పరిధి మద్దువలస జంక్షన్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ షేక్‌శంకర్ తెలిపారు. గురువారం అగ్రహారం సమీపంలోని నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి రూరల్: మండలంలోని గొల్లపల్లి, పెంట, జగన్నాథపురం, బూర్జ, నారసింహునిపేట, రామభద్రపురం, కలువరాయి, వంతరాం ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. గొల్లపల్లి సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట పరిధిలో ఉన్న 11 కేవీ సంకిలి ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లావేటి హరిబాబు తెలిపారు. సంకిలి, లక్ష్మీపురం, చాటాయివలస, ఖండ్యాం, కొమెర, వెంకటాపురం, మజ్జిరాముడుపేట, దేవుదళ, పుర్లి, వన్నలి, ఉప్పర్నాయుడువలస, కొండలమామిడివలస గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, గ్రామస్తులు గమనించి సహకరించాలని కోరారు.

సభలను విజయవంతం చేయండి

బొబ్బిలి: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి, 80 వసంతాలు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించనున్న సభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు బలరామనాయుడు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలోని టెన్నిస్ కోర్టు వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో, 14వ తేదీన జిల్లా స్థాయిలో సభలు నిర్వహిస్తామన్నారు. ఏపీటీఎఫ్ సభ్యులంతా ఈ సభలకు హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

బొబ్బిలి: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి, 80 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో మండలంలోని ఉపాధ్యాయులకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గురువారం నిర్వహించారు. విజేతలుగా ఎస్.జగదీశ్వరరావు, రెడ్డి శ్రీనివాసరావు, అలజంగి చిన్నారావు, బారు వేణులు నిలిచారు.

యంత్ర వినియోగంతో కూలీల కొరత తగ్గించవచ్చు

రాజాం: వరి ఎద పంట సాగులో యంత్ర వినియోగం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ జిల్లా ఏరియా మేనేజర్ దేవుడుబాబు అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో యంత్ర సాయంతో సాగు చేసిన వరి ఎద పంటను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన కూలీలు, విత్తన కొరతను అధిగమించడం, సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనడం వంటి వాటిని వివరించారు. వరి ఎద పంటలో సరైన కలుపు నివారణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు అనుసరిస్తే పెట్టుబడి తగ్గి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త ఎం.సంతోష్, టి.శరత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన

వంగర: మండలంలోని మరువాడ గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు మాట్లాడుతూ పంటపొలాల్లో పొటాష్ వినియోగం తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా జిల్లేడు ద్రావణాన్ని వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లేడు ఆకులు, నీరు, ఆవుమూత్రం వంటివి వినియోగించి జిల్లేడు ద్రావణం తయారు చేసుకోవచ్చని, ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వి.పోలినాయుడు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



నదీ తీరాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సందీప్

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి గ్రామం వద్ద సువర్ణముఖి నది వద్ద వరద ఉధృతిని మండల ప్రత్యేకాధికారి కె.సందీప్ గురువారం పరిశీలించారు. రానున్న రోజుల్లో మరో అల్పపీడనం కారణంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. అనంతరం పునరావాస కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు డి.ధర్మరాజు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గురుదేవో భవ!



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు



రామభద్రపురం ఎమ్మార్సీలో విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దారు సులోచనరాణి, ఉపాధ్యాయులు



రామభద్రపురం: ముచ్చర్లవలస ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవంలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు



తెర్లాం ఎమ్మార్సీలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో త్రినాథరావు, యూటీఎఫ్ నాయకులు



తెర్లాం: టీచర్స్ డే సందర్భంగా ఎంఈవో-2 పాపారావును సత్కరిస్తున్న అధికారులు



బొబ్బిలి: మండల కేంద్రంలోని కేజీబీవీలో గురుపూజోత్సవం

గురువులకే గురువు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులంతా సర్వేపల్లి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడి, సమాజంలో గురువుకున్న సమున్నతమైన స్థానాన్ని వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు ఎప్పుడూ స్నేహితుడిగా, వేదాంతిగా, మార్గదర్శకుడిగా ఉంటూ విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి, ఎదుగుదలకు సహకరిస్తాడన్నారు. తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువుదేనని, చక్కని విద్యను ఓ వైపు అందిస్తూనే మరోవైపు మనల్ని గొప్ప సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించి, గురుభక్తిని చాటుకున్నారు.

– బొబ్బిలి, రాజాం



వంగరలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి సందీప్, ఎంఈవో దుర్గారావు



రాజాం ఎమ్మార్సీలో సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్, తదితరులు



సంతకవిటి: ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, అధికారులు



రేగిడి: కందిశ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురుపూజోత్సవ దృశ్యం



రాజాం సిటీ: పొగిరి పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న సిబ్బంది



బాడంగి: పిండ్రంగివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఉపాధ్యాయుల వేషధారణ



బాడంగి శాఖా గ్రంథాలయంలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు



బొబ్బిలి ముస్లిం వీధిలో చిన్నారి సర్వేపల్లి వేషధారణ

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

● ఎస్పీ వకుల్ జిందల్

రామభద్రపురం: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలతో పాటు, రికార్డులను పరిశీలించిన అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాను జిల్లాకు బదిలీపై వచ్చిన నెలన్నర రోజుల్లో 29 గంజాయి కేసులు నమోదు చేశామని తెలిపారు. ఒడిశాలోని రాయగడ, సుంకి, పొట్టంగి తదితర ప్రాంతాల నుంచి గంజాయి ఎక్కువగా రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. చిన్న మొత్తాల్లో గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకుని, పెద్ద మొత్తాల్లో సరఫరా చేస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, రౌడీయిజం, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించామన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రి వేళల్లో పోలీస్ బీట్‌లు వేస్తున్నామని, విజిల్స్ వేస్తూ సిబ్బంది రౌండ్‌లు వేస్తున్నారన్నారు. పోక్సో కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని, కేసు నమోదైన వారిపై 60 రోజుల్లో చార్జిషీటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోర్టు తీర్పునివ్వగా, ఏ రాష్ట్ర ప్రభుత్వమూ దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. సైబర్‌నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందల్ గురువారం సందర్శించి, విలేకరులతో కాసేపు మాట్లాడారు. జిల్లాలో గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, రామభద్రపురం



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

మండలంలోని కొట్టక్కి వద్ద నెల రోజుల క్రితం ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తరలించే ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందల్ గురువారం సందర్శించి, అక్కడి రికార్డులు, పోలీస్ సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. మత్తుపదార్థాల రవాణా జరగకుండా చూడాలని, శాంతిభద్రతలు కాపాడాలని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ పి.శ్రీనివాసరావు, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తదితరులు ఉన్నారు.

పరామర్శ

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలసకు చెందిన సత్యసాయి సేవా సంస్థల రాజాం జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, ఆయన కుమారుడు కిరణ్ కుమార్‌లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆ గ్రామానికి గురువారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్‌లు కరణం గోవిందరావు, కరణం శ్రీనివాసరావు, కెంబూరీ వెంకటేశ్వరరావు, కింజరాపు సురేష్, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

ఇదిలా ఉండగా, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన రామకృష్ణ సంస్మరణ సభలో ఆ సంస్థల విజయనగరం జిల్లా అధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.



రామకృష్ణ, కిరణ్‌కుమార్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, తదితరులు

సునీల్‌కుమార్ రాథోడ్, రాష్ట్ర గ్రామ సేవా ఇన్‌చార్జ్ ఎం.ఎస్.సత్యనారాయణలు పాల్గొని, రామకృష్ణ సేవలు కొనియాడారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాలవికాస్ ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్, జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జ్ మనోహర్, జిల్లా యూత్ ఇన్‌చార్జ్ రాజు, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ హైమావతి, జిల్లా స్టడీ సర్కిల్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, రాష్ట్ర స్పిరిట్యువల్ ఇన్‌చార్జ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సదుపాయం కల్పించండి

బొబ్బిలి: మండలంలోని గిరిజన గ్రామాలైన కృపావలస, దీవెనవలస, సియోనువలస, చినఅక్కేనవలసలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని సీపీఐ నాయకుడు ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఇప్పటికీ చాలా గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆయా గ్రామాల్లో చాలాకాలంగా విద్యుత్ సదుపాయం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ గ్రామాలకు విద్యుత్ వెలుగులు ప్రసాదించాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ఏడీఈ సాంబశివరావు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు పీవీటీజీ పథకం మంజూరైందని, పనులు మొదలు పెడదామంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు వస్తే వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

మొక్కలు నాటాలి

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొని, యువతతో కలిసి పలు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలు నాటడమే కాకుండా నాటిన మొక్కలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



కొండవలసలో మొక్కలు నాటుతున్న సీఐ ఉపేంద్ర

సమస్యల పరిష్కారానికే 'గ్రామ సందర్శన'



రాజాం: సోపేరులో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



వంగర: కొప్పరవలసలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సందీప్



మెంటాడ: గ్రామ సందర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మండల ప్రత్యేకాధికారి ప్రమీలా గాంధీ



సంతకవిటి: తలతంపరలో గ్రామ సందర్శనలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

తెర్లాం/బొబ్బిలి రూరల్/మెంటాడ/సంతకవిటి/వంగర/రాజాం: మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఐసీడీఎస్ పీవోలంతా కలిసి గ్రామాల్లో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశు వైద్యశాలలు, సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, సదుపాయాలను పరిశీలించారు. అలాగే గ్రామస్తుల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సదరు అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు ఇంటి సామగ్రి ధ్వంసం

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో పాటు ఓ ఇంటిపై పిడుగు పడడంతో ఇంట్లోని సామగ్రి ధ్వంసమైంది. దీనికి సంబంధించి వీఆర్‌ఓ సువ్వాడ నరసింహనాయుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బొత్స ఈశ్వరమ్మ ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంట్లో ఉన్న ఏసీ, ఫ్రిజ్, బోరు మోటార్, విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రి అంతా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సుమారు రూ.1.5లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతిందని బాధితురాలు తెలిపారు. గ్రామ సర్పంచ్ శనపతి రాంబాబుతో కలిసి గ్రామానికి వెళ్లి పరిశీలించినట్టు వీఆర్‌ఓ తెలిపారు. పిడుగుపాటుపై తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు సమాచారం ఇచ్చామని చెప్పారు. బాధిత కుటుంబాన్ని రంగప్పవలస సర్పంచ్, మాజీ సర్పంచ్ పరామర్శించారు.



తమ్మయ్యవలసలో ఇంటిపై పిడుగు పడడంతో ధ్వంసమైన వస్తువులు

తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రధానం



తెర్లాం: లోచర్లలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న బాడంగి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి



రేగిడి: చిన్నశిర్లాం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శశికళ

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ప్రధానంగా పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ సదస్సులు, ర్యాలీలు, సమతుల ఆహార ప్రదర్శనలు చేపట్టారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పాల్గొని, పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

బొబ్బిలి: మండల కేంద్రంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ గురువారం చేపట్టారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి హానికరమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, కె.సత్యనారాయణ, ఎం.చినగౌరినాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.